నిలయం
శ్రీకాకుళం

# 11

"నాను రాను". ఖచ్చితంగా చెప్పేసింది కొండమ్మ. ఆమె కళ్లలోని కోపం, ఆమె ఎదురుగా వున్న కట్టెల పొయ్యిలోని నిప్పుకణికలుగా కనబడింది.

"అలా అనేసి నావేంటీ?" ఆమె భర్త సింహాచలం అడిగాడు. అందిన అవకాశం చేయిజారిపోతుందనే బాధ అతనిది. "పండుగసేసుకుంటున్నాడని వచ్చి కేకసినాడు, కదేంటి, నీ తమ్ముడు..."

"అయితే..." కోపంతో ఉడికిపోయింది కొండమ్మ. పొయ్యిమీద ఉడికే అన్నం ఒకసారి కలిపింది. పొయ్యిలోకి రెండు ఎండు పుల్లలు తోసింది. ఆమె గుండెలోని కోపంలా పైకెగసింది అగ్నిజ్వాల.

"నిరుడు, వాడు పండుగ సెయ్యలేదుగా..." సింహాచలం అన్నాడు. "అంతకు ముందు ఏడు అత్తపోయింది, పండుగ లేదు. రెండేళ్ళు పోయాక కేకేసినాడు, వాడే వచ్చాడు..."

కొండమ్మ మాటలాడలేదు. ఆమె మోమువైపు చూసాడు. మండే పొయ్యి ఎదుట కూర్చున్నా, ఆమె మోములో వెలుగులేదు. ఆమెని అలాచూస్తూ కూర్చొని ఆలోచించాడు సింహాచలం.

అతని అత్తవారి ఊరులో అమ్మవారి పండుగ. తొమ్మిదిరోజుల పండుగ - ఒక్కొక్క రోజు ఒక్కొక్క కుటుంబం చేస్తారు. గొర్రెని బలి ఇస్తారు అత్తవుండేటప్పుడు ప్రతి సంవత్సరం పండుగకి. వెళ్ళేవాడు పండుగక్కెళ్తే మజా చెయ్యవచ్చును. కావలసినంత మందు, మాంసం! ఇంకేం కావాలి! పేకాటకు కూడా స్నేహితులు దొరుకుతారు.

కాని కొండమ్మ బయలుదేరనని అంటోంది. బయలుదేరక పోవటానికి కారణం ఏమిటని ఎంత ఆలోచించినా అర్థం కాలేదు

అతనికి. వెళ్ళాలనే ఆత్రుత అతనిది. అందుకే మళ్ళీ అన్నాడు. "నువ్వు వద్దనుకుంటే రాక, నానుపోతా..."

హఠాత్తుగా పొయ్యి భగ్గుమని మండింది "వెళ్ళు... వెళ్ళు..." కొండమ్మకి  అరికాలు మంట నెత్తికెక్కింది. "వెళ్ళి బాగా తాగి తొంగుండిపో.. తాగటానికేగా వెళ్ళటం. తాగటానికి ఇక్కడ లేదా? నువ్వు తాగటం లేదా?..."

అలా అనేసింది కాని, కొండమ్మకి కూడా వెళ్ళాలనే వుంది.

తమ్ముడంటే, ఆమెకి చాలా ప్రేమ, అభిమానం. తన చేతులమీద పెంచింది వాడిని. చిన్నప్పుడు వాడిని ఎత్తుకు తిప్పింది వాడి అమ్మ కాదు, కొండమ్మే! చదువంటే వాడికి ఇష్టం.

అయిదో తరగతి తరువాత వాడిని ఆపై చదివించలేనని నాన్న చేతులు ఎత్తేస్తే ఎనిమిదో తరగతి చదివే కొండమ్మ కూలిపనికి వెళ్ళివాడిని బడికి పంపింది. ఏ కష్టం వచ్చినా, ఏం కావలసివచ్చినా వాడు కొండమ్మతోనే చెప్పుకునేవాడు. గత రెండేళ్ళుగా వాడురాక, కొండమ్మవాడి ఇంటికి వెళ్ళక. వాడిని చూడలేదని చాలా బాధ అనుభవిస్తూ వచ్చింది. ఇప్పుడు వచ్చాడు. పండుగకి రమ్మని ఆహ్వానించాడు. రాకపోతే తనమీద ఒట్టే! అని కూడా చెప్పివెళ్ళాడు.

కాని...

తమ్ముడింటికి వెళ్తే, తనని ఎవరూ పట్టించుకోరు అనేదే కొండమ్మ బాధ. మరదలు మాటలాడదు. రోజంతా కూర్చున్నా, ఆమె పెదవి విప్పటంకాని ఒక చుక్కటినీళ్ళు పొయ్యటం కాని చెయ్యదు. అమ్మవుండేటప్పుడు అమ్మగారింటికి వచ్చి ఏదో తినేది.

కొండమ్మ మరదలుకి, కూలిపని చేసి బ్రతికే కొండమ్మంటే అసహ్యమట! పదో తరగతి చదవడమే, ఆమె పొగరుకు కారణం. అంతేకాదు. ఆమె నాన్న అయిదు సెట్లు భూమి కూడా ఇచ్చారు, ఇల్లు

కట్టుకోవటానికి.

తమ్ముడైతే వెళ్ళగానే ఒకసారి పలకరించి వెళ్ళిపోతాడు. అమ్మపోయాక ఒక్కసారి కూడా రమ్మని పిలవలేదు వాడు.

ఇప్పుడు........

చీకటి చిక్కపడింది. పొయ్యిలోని నిప్పుకణికలు మెల్లమెల్లగా ఆరిపోయాయి.

తెల్లవారకముందే, తమ్ముడు ఇంటికి వెళ్ళటానికి బయలుదేరిన కొండమ్మని చూసి ఆశ్చర్యపోయాడు సింహాచలం.

రక్తసంబంధీకుల మధ్య వచ్చే కోపతాపాలు మనస్పర్థలు, వైశాఖ మాసపు కురవని మబ్బులే కదా!

కొండమ్మని చూడగానే మామూలుగా ఒక నవ్వునవ్వి ఇంటిలోపలకు వెళ్ళిపోయింది, ఆమె మరదలు. లోన పదిమందికి పైగా, ఆమె బంధువులు ఉన్నట్టు గమనించిన కొండమ్మ ఇంటి అరుగుమీద కూర్చొనివున్న చెల్లి వద్ద చేరింది

సింహాచలాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు, పలకరించనూలేదు. అతనికి, అందరితోపాటు, ఒక ముంతకల్లు పోసారు. మాంసం కూడా ఎక్కువ వడ్డించలేదు. ముసలి గొఱ్ఱె కొని బలి ఇచ్చినట్టున్నారు, మాంసం తిన్న మజా కలగలేదు అతనికి.

మరునాడు తెల్లవారగానే, తన ఇంటికి బయలుదేరిపోయింది కొండమ్మ.

“ఏమీ అనుకోకేం, వదినా...” కొండమ్మకి బొట్టుపెట్టి ఒక జాకెట్టు గుడ్డ చేతిలో పెట్టి అంది, కొండమ్మ మరదలు. “చీర పెట్టాలనే అనుకున్నాం. కాని ఒకరా, ఇద్దరా.... ఇందరికి” లోపల కూర్చొనివున్న ఆమె బంధువులని చూసి అంది ఆమె.

కొండమ్మ మాటలాడలేదు.

"ఒరేయ్, ఆ డబ్బులేవో. ఇచ్చేయిండిరా" కొండమ్మ నాన్న అన్నాడు.

"ఏ డబ్బు....." తమ్ముడు మెల్లగా గొణిగాడు.

తమ్ముడు, మరదలు ఒకరి మోము ఒకరు చూసుకున్నారు. వారి ముఖాలమీద, కంగారు, ప్రస్ఫుటంగా కనడింది.

"అదేరా, ఆ డబ్బు.... మీ తల్లి తాడు తాలుకు డబ్బు..."

కొండమ్మకి అర్థమైంది. తల్లిపోయినప్పుడు తల్లిమెడలో తాళిగొలుసు వుండేది - పదిహేనూ, ఇరవై వేలు ఖరీదు చేసే గొలుసు అమ్మపోయిన కొత్తలో ఆ గొలుసు అమ్మేసి ఆడపిల్లలిద్దరికి డబ్బులు ఇచ్చేయమని కొండమ్మ నాన్న చెప్పాడు కూడా. కాని అప్పటివరకు డబ్బులు ఇవ్వలేదు తమ్ముడు.

"ఓ ఆడబ్బా...." తమ్ముడు మాటలు సర్దుకొని అన్నాడు.

"అదెప్పుడో ఖర్చయిందిగా. ఆ డబ్బుతోనే కదా, ఈ పండుగ...."

ముంతకల్లుకి, ముసలి గొర్రె మాంసానికి ఇంత ఖర్చా!

నాన్న అలా ఉండిపోయాడు.

ఒకటి రెండు వేలు ఖర్చుచేసి పదిహేను వేలరూపాయల గొలుసు మింగ గలిగినందుకు గర్వంతోనూ, సంతృప్తితోనూ, చిరునవ్వు నవ్వింది కొండమ్మ మరదలు.

తమ్ముడు పండుగ చెయ్యటంలోని ఉద్దేశ్యం వ్యక్తమైన కొండమ్మ తలవంచుకొని వెనుకకు తిరిగిచూడకుండా నడిచింది.

లోగుట్టు పెరుమాళ్లకెరుక....!